# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 09 ఆగష్టు 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 12

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





3లో

కండక్టర్‌ను అకారణంగా తొలగించలేదు



2లో..

## యధాతథంగా ద్రవ్య పరపతి విధానం

రెపోరేటులో మార్పు లేదన్న ఆర్‌బిఐ

యూపిఐ చెల్లింపుల్లో 5 లక్షల వరకు అనుమతి

వివరాలు వెల్లడించిన గవర్నర్ శక్తికాంత్ దాస్




2లో..

## జిఎస్టీ కుంభకోణంలో సిఐడి దూకుడు

మాజీ సిఎస్ సోమేశ్ కుమార్ తదితరులకు నోటీసులు

రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం



2లో..

## సాగర్‌కు కొనసాగుతున్న వరద ప్రవాహం

26 గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ పరుగులు



2లో..

## బెంగాల్ మాజీ సిఎం.. కమ్యూనిస్ట్ దిగ్గజం

బుద్దదేవ్ భట్టాచార్య కన్నుమూత



### సిఎం రేవంత్ చర్చలు ఫలవంతం

### పలు కంపెనీలు పెట్టుబడులకు సిద్ధం

### ఒప్పందాలన్నీ ఖచ్చితంగా తెలంగాణ అభివృద్ధి కోసమే

### నిరాధార వార్తలపై ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ వివరణ

# అమెరికాలో పెట్టుబడుల వేట

అమెరికాలో కొనసాగుతున్న సీఎం పర్యటన
కాగ్నిజెంట్,చార్లెస్ స్వాబ్ తదితర సంస్థలకు స్వాగతం బిజీ బిజీగా గడుపుతున్న రేవంత్ రెడ్డి
పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా ఒప్పందాలు
డల్లాస్ చేరుకున్న సిఎం రేవంత్ బృందం
మహాత్ముడికి ఘనంగా నివాళులు

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన పెట్టుబడులన్నీ బోగస్ అంటూ ప్రచారం జరగడాన్ని ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తీవ్రంగా ఖండించారు. మొన్న, నిన్న చేసిన కొన్ని పెట్టుబడుల ప్రకటనలు బోగస్ అని వార్తలు వెల్లువెత్తిన నేపథ్యంలో జయేశ్ రంజన్ వీడియో ద్వారా వివరణ ఇచ్చారు. తెలంగాణకు పెట్టుబడులన్నీ వాస్తవమే అని స్పష్టం చేశారు. పెట్టుబడుల కోసం అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి అమెరికాలో చేస్తున్న మీటింగుల విశ్వసనీయత మీద తెలంగాణ ప్రజలకు ఎటువంటి అనుమానాలు అవసరం లేదని తెలిపారు. అన్ని విషయాలు చెక్ చేసిన తర్వాతే మీటింగ్‌లు చేస్తున్నామని జయేష్ రంజన్ వీడియోలో స్పష్టం చేశారు. ఫైనాన్షియల్ సర్వీసెస్లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో తమ సంస్థను నెలకొల్పేందుకు సిద్ధమైంది. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హోవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవెలప్?మెంట్? సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛా÷-లర్గ÷స్ స్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపింది.

# బిజెపితో బంధమా..విలీనమా..



**హైదరాబాద్:** పదేళ్లపాటు అధికారం అనుభవించి, ఆర్థికంగా బలపడి, ఇష్టారాజ్యంగా పాలన చేసిన బిఆర్ఎస్‌కు ప్రస్తుత పరిస్థితులు మింగుడు పడడం లేదు. వరుసగా మూడోసారి అధికారం తమదే అనుకున్న తరుణంలో పరిస్థితులు తలకిందులు అయ్యాయి. ఈ ఉక్కపోతను కెసిఆర్ కుటుంబం భరించకోలేక పోతున్నది. ఓ వైపు విచారణ, మరోవైపు విమర్శలు, ఇంకోవైపు కూతురు కవిత జైలకు వెళ్లడం వంటి విషయాలు కెసిఆర్‌ను పుండులాగా సలుపుతున్నాయి. అందుకే దీనిని నుంచి బయటపడే మార్గాల గురించి ఆలోచన చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ప్రధానంగా రేవంత్ సిఎం కావడాన్ని బిఆర్ఎస్ తట్టుకోలేక పోతోంది.ఈ క్రమంలో దీనికి చెక్ పెట్టాలన్న ఆలోచన నుంచే బిజెపికి చేరువ కావాలన్న సూత్రం పుట్టిందన్న ప్రచారం సాగుతోంది. ప్రధానంగా రెండు విషయాలపై బిఆర్ఎస్‌లో అంతర్గతంగా చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ బిఆర్ఎస్ అంటే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు లాంటి వారి మధ్యనే అని గుర్తించాలి.
ప్రస్తుత రాజకీయాలను మలుపు తిప్పాలన్నదే వారి ఎత్తుగడగా ఉంది. ఇందులో భాగంగా కేంద్రంతో సఖ్యతగా ఉంటూ కవితను విడిపంచుకోవడం...బిఆర్ఎస్ మద్దతను బిజెపికి తెలపడం. అయితే దీనివల్ల కేవలం కవిత మాత్రమే బయటకు రావచ్చు. కానీ అధికారం దక్కదు. అందుకే ఎన్‌డిఎలో చేరేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఐదుగురిలో కేశవరావు జారుకుని రాజీనామా చేశారు. బిజెపికి కూడా రాజ్యసభలో బలం అవసరం. నలుగురు రావడం అంటే తక్కువేమీ కాదు. అందుకే బిఆర్ఎస్, బిజెపిల విలీనపై ఈ మధ్య పుంఖానుపుంఖాలుగా వార్తలు తన్నుకు వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా బిఆర్ఎస్ విలీనం అయితే కెసిఆర్ కేంద్రమంత్రిగా ఢిల్లీకి వెళ్లడం.. ఒప్పందంగా ఉండొచ్చు. తదుపరి కాలంలో తెలంగాణలోనూ షిండేలను సృష్టించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అన్నది కావచ్చు. ఇవన్నీ కూడా ఊహాజనితమే అయినా ..వీటిచుట్టే ప్రచారం సాగుతోంది.
బిఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు కలిశాక వారి బలం ఇప్పుడున్న పరిస్థితుల్లో 36కు చేరుకుంటుంది. ఓ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. వారిని కూడా వెనక్కి రప్పించడం జరగవచ్చు. లేదా కోర్టు ద్వారా ఒకరిద్దరి పై వేటు వేయించి దారికి తెచ్చుకునే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి.అందుకే తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయనే భ్రమను కలిపిస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు జరుగుతున్నాయని విస్తృత ప్రచారం ప్రారంభమయింది. గత నాలుగైదు నెలలుగా ఈ తరహా ప్రచారం అంతర్గతంగా సాగుతోంది.కానీ ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు. ఓ ట్వీట్ ద్వారా వీలైనంత బలంగా విలీనం ప్రచారం కుట్ర పూరిత ప్రచారం అన్నారు కానీ.. ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు. బీఆర్ఎస్ పార్టీ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అందుకే ఎక్కువ మంది విలీన చర్చలు నిజమేనని అనుకుంటున్నారు. గత నెలలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. కొన్ని కీలక సమావేశాలు ఉన్నప్పటికీ వారు ఢిల్లీలో మకాం వేశారు. వారు ఎవరితో సమావేశమయ్యారో ఎవరికీ తెలియదు. వీరి ఢిల్లీ టూర్‌పై కాంగ్రెస్ పార్టీ సెటైర్లు వేసింది. రేవంత్ రెడ్డి అయితే పార్టీని తాకట్టు పెట్టడానికి వెళ్లారని విమర్శించారు. బీజేపీ నేతల కోసం పడిగాపులు పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పుడు తాజాగా మరోసారి కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. ఒక్క రోజు కొంత సేపు కవితతో తీహార్ జైల్లో ములాఖత్ అయ్యారు. మిగిలిన రోజుల్లో ఏం చేస్తున్నారో .. ఎవరితో సమావేశం అవుతున్నారో స్పష్టత లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లుగా ఓ సారి ఫోటో రిలీజ్
చేశారు. అందుకోసం రోజుల తరబడి అక్కడ ఉండాల్సిన అవసరం లేదు. వీరు బీజేపీ పెద్దలతో రహస్యంగా విలీన

> **కెసిఆర్ అడుగులు హస్తిన వైపు పడేనా?**
>
> **బిఆర్ఎస్, బిజెపిల రాజకీయాలపై సర్వత్రా చర్చ**

# వయనాడ్‌లో 417కు చేరిన మృతుల సంఖ్య



**న్యూఢిల్లీ:** ప్రకృతి సృష్టించిన బీభత్సంతో కేరళలో వయనాడ్ జిల్లా ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. ఆయినా వర్షభయం మాత్రం వున్నాడుతూనే ఉంది. ఈ క్రమంలో బాధిత ప్రజలను ఓదార్చి, విలయాన్ని నేరుగా చూడాలని ప్రధాని మోడీ నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఆయన వయనాడ్ జిల్లాలోని చూరల్మల, ముండక్క గ్రామాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ 10వ తేదీన.. శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించనున్నారు. అలాగే నిరాశ్రయులు తలదాచుకున్న పునరావాస కేంద్రాలను సైతం ఆయన ఈ పర్యటనలో భాగంగా సందర్శించనున్నారు.
వయనాడ్‌లో చోటు చేసుకున్న ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన ఎంపీలు విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. పర్యటన అనంతరం ప్రధాని ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తారన్నది ఆసక్తిగా ఎదరు చూస్తున్నారు. వయనాడ్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, కొండ చరియలు విరిగి పడడంతో మృతుల సంఖ్య 417కు చేరింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని సమాచారం. అలాగే వందలాది మంది గల్లంతయ్యారు. వారి కోసం నేటికి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. 10 వేల మందికి పైగా నిరాశ్రయులు వివిధ పునరావాస కేంద్రాల్లో తల దాచుకున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ శనివారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కేరళ బయల్దేరి వెళ్తారు. అక్కడ కన్నూర్‌లో ల్యాండ్ అవుతారు. అక్కడి నుంచి కొండచరియలు విరిగిపడిన ప్రాంతానికి వెళ్లి అక్కడి పరిస్థితిని సమీక్షించనున్నారు. అనంతరం ప్రమాద బాధితుల్ని మోదీ పరామర్శించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలు గురువారం వెల్లడించాయి. కాగా, వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. పరిహారం పెంచాలని, సమగ్ర పునరావాస ప్యాకేజీని ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు లోక్‌సభలో కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ వయనాడ్ పర్యటకు ప్రాధాన్యత సంతరించుకుంది. గత నెల 30వ తేదీన భారీ వర్షాల కారణంగా వయనాడ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీగా కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. ఈ ప్రకృతి విపత్తులో చూరాల్‌మాల్ పట్టణం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. సుమారు 417 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వందల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. వారంతా ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 10 వేల మందికిపైగా బాధితులు రిలీఫ్ సెంటర్లలో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు బుధవారం లోక్‌సభలో జీరో అవర్‌లో వయనాడు అంశంపై వాడి వేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. వయనాడ్ ప్రజలకు నష్ట పరిహారం ప్రకటించాలని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విపత్తు సంభవించిన ప్రాంతాల్లో తాను పర్యటించానన్నారు. ఈ విపత్తులో మొత్తం కుటుంబం కుటుంబమే తుడుచు పెట్టుకుని పోయిందన్నారు. ఇక కొన్ని చోట్ల అయితే కుటుంబంలో ఒక్కరు మాత్రమే మిగిలారని చెప్పారు. అదీ కూడా ఇంట్లో పెద్ద వారు లేకుంటే చిన్నారుల్లో ఒక్కరే మిగిలి ఉన్నారని... ఇటువంటి ఘటనలు వయనాడ్ జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీతోపాటు ప్రియాంక గాంధీ ఇటీవల వయనాడ్ జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇటీవల కీలక ప్రకటన చేశారు. భారీ వర్షాలు, వరదలపై కేరళ ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించామని చెప్పారు. కానీ కేరళ ప్రభుత్వం తమ హెచ్చరికలను బేఖాతరు చేసిందన్నారు. దీనిపై కేరళ సీఎం పినరయి విజయ్ స్పందించారు. మోదీ ప్రభుత్వం ఎటువంటి హెచ్చరికలు జారీ చేయలేదన్నారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేరళ సీఎం ఖండించారు.

> **కేరళలోని వయనాడ్ జిల్లాలోని మెప్పాడి సమీపంలోని కొండ చరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకు పెరుగుతుంది. ఇప్పటి వరకు అధికారికంగా 417 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది.**

వేగుచుక్క
TELUGU DAILY NEWS





# 20 లక్షలం లంచం తీసకున్న ఇడి అధికారి అరెస్ట్ చేసిన సిబిఐ అధికారులు

**హైదరాబాద్:** ముంబైకు చెందిన ఒక నగల వ్యాపారి నుంచి రూ. 20 లక్షల లంచం పుచ్చుకుంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) అసిస్టెంట్ డైరెక్టర్ ఒకరిని సిబిఐ గురువారం అరెస్టు చేసింది. ఆగస్టు 3, 4 తేదీలలో ఆ నగల వ్యాపారి ప్రాంగణాలలో ఇడి సోదాలు నిర్వహించింది. తనకు రూ. 25 లక్షల లంచం ఇవ్వకపోతే నగల వ్యాపారి కుమారుడిని అరెస్టు చేస్తానని ఇడి అసిస్టెంట్ డైరెక్టర్ సందీప్ సింగ్ యాదవ్ బెదిరించినట్లు సిబిఐ వెల్లడించింది. బేరసారాలు జరపగా రూ. 20 లక్షలకు వారి మధ్య ఒప్పందం కుదిరిందని సిబిఐ అధికారులు తెలిపారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్(సిబిడిటి) నుంచి ఇడిలో చేరిన యాదవ్‌ను లంచం తీసుకుంటుండగా ప్రత్యక్షంగా పట్టుకున్నట్లు అధికారులు చెప్పారు.

# 42శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలి

**కామారెడ్డి:**రాష్ట్రంలో ఉపాధ్యాయులకు 42శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బకాయి డీఏని వెంటనే విడుదల చేయాలన్నారు. మెడికల్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. సీపీఎస్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సర్కారు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రతినిధులు ఖాజా మొయినొద్దిన్, రాజేందర్, కుర్షీద్ అహ్మద్, షాహిన్బేగం, నాహిద్ ఫాతిమా, నటరాజ్, మధు, రాజు పాల్గొన్నారు.

# కండక్టర్‌ను అకారణంగా తొలగించలేదు

**ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాం**

**జనగామ కండక్టర్ వ్యవహారంపై సజ్జనార్ వివరణ**




**హైదరాబాద్:** జనగామ డిపోకి చెందిన ఒక కండక్టర్‌ను అకారణంగా విధుల నుంచి తప్పించారని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని... ఇది పూర్తి అవాస్తవమని టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. అసలేం జరిగిందంటే.. ఈ నెల 1వ తేదీన ఒక మహిళ, తన తల్లి, ఏడాది కుమారుడితో కలిసి హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు జనగామ డిపోకి చెందిన బస్సు ఎక్కారు. వీరంతా మొదటి వరసలో ఉన్న మహిళా రిజర్వ్‌డ్ సీట్లలో కూర్చున్నారు. ఆ సమయంలో ఆ సీట్లను ఖాళీ చేయాలంటూ కండక్టర్ శంకర్ వారితో అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించారు. లేకుంటే బస్సు దిగి వెళ్లిపోవాలని చెప్పారు. తన అమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారని చెప్పినా వినకుండా.. ముగ్గురిని మడికొండ వద్ద బస్సులోంచి దింపేశారు. ఈ విషయాన్ని బాధిత మహిళా ప్రయాణికురాలి భర్త సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ ద్వారా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సంబంధించిన వివరాలతో పాటు బస్సు, డ్రైవర్, కండక్టర్ ఫోటోలను సైతం షేర్ చేశారు. ఈ ఘటనపై యాజమాన్యం విచారణకు ఆదేశించింది. ఈ ఆదేశాలతో ఆర్టీసీ వరంగల్ రీజియన్ అధికారులు విచారణ జరిపారు. ఈ విచారణలో మహిళా ప్రయాణికురాలి పట్ల దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించడం, నిబంధనలకు విరుద్ధంగా మార్గమధ్యంలో బస్సులోంచి వారిని దించినట్లు తేలడంతో కండక్టర్ శంకర్‌ను విధుల నుంచి తప్పించడం జరిగింది. టీజీఎస్ఆర్టీసీ నియమ నిబంధనల మేరకే కండక్టర్‌పై శాఖపరమైన చర్యలను సంస్థ తీసుకుంది. గతంలోనూ శంకర్‌పై ఇలాంటి ఫిర్యాదులే వచ్చాయి. దీంతో రెండు సార్లు సస్పెండ్ చేయడంతో పాటు ఒకసారి ఆయనను విధుల నుంచి తొలగించడం జరిగింది. అంతేకాదు, అధికారులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా వేర్వేరుగా ఐదుసార్లు మూడున్నరేళ్ల పాటు విధులకు గైర్హాజరు అయ్యారు. మొత్తంగా 12 సార్లు శంకర్‌పై ఫిర్యాదులు వచ్చాయని సజ్జనార్ వెల్లడించారు. అయినా మానవత దృక్పథంతో సంస్థ ఆయనకు పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. తాజాగా మళ్లీ ఫిర్యాదు రావడంతో విచారణ జరిపి గతంలో మాదిరిగానే శాఖపరమైన చర్యలను సంస్థ తీసుకుందన్నారు. ఫిర్యాదుల విషయంలో నిబంధనల ప్రకారమే యాజమాన్యం నడుచుకుంటోందని స్పష్టం చేశారు. అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందని సజ్జనార్ తెలిపారు.

# ఖేలో ఇండియా క్రీడాకారుల ఎంపిక.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఆగస్టు 8**



నగరంలోని రవి పబ్లిక్ పాఠశాలలో గురువారం ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సరళ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ, భారత్ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి కిరీటి (ఖేలో ఇండియా రైసింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్) కార్యక్రమం తమ పాఠశాలలో నిర్వహించడం జరిగిందని అన్నారు. ఖేలో ఇండియా ప్రోగ్రాం తమ పాఠశాలకు అవకాశం రావడం చాలా అదృష్టం గా భావిస్తున్నాం అన్నారు. రానున్న రోజుల్లో ఒలంపిక్స్ పై దృష్టి సారించి, ప్రతిభావంతులైన క్రీడాకారులను అందించడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ ఎంపికలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంబంధించిన బృందం, స్పోర్ట్స్ అథారిటి కబడ్డీ కోచ్









శ్రీనివాస్ రావు, అథ్లెటిక్స్ కోచ్ సుబ్బారావు పర్యవేక్షణలో నిర్వహించినట్టు తెలిపారు.సుమారు 100 పైగా విద్యార్థులకు ఫిజికల్ ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జాయింట్ సెక్రెటరీ శ్యామ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించాలి.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, ఆగస్టు 8**

స్వాతంత్ర దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 15 ఆగస్ట్ స్వాతంత్ర దినోత్సవం కార్యక్రమాలను ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందని, జిల్లా ప్రజలకు ఎప్పటికీ గుర్తుండి పోయేలా స్వాతంత్ర పోరాటంలో పాల్గొని తమ జీవితాలను అంకితం చేసిన మహానుభావుల స్ఫూర్తితో కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే ముఖ్య అతిథి, వీఐపీలు, స్వాతంత్ర సమరయోధులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థిని విద్యార్థులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మరియు జిల్లా ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బంది కాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పెరేడ్ గ్రౌండ్ ముస్తాబు, సెక్యూరిటీ, స్టేజి, సౌండ్ సిస్టం, సీటింగ్, షామియానా, త్రాగునీరు, సంస్కృతిక




కార్యక్రమాలు, వివిధ శాఖలు శకటాలు, అధికారులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలు, ముఖ్య అతిథి ప్రసంగం కాఫీ తయారీ, కలెక్టరేట్‌ను విద్యుత్ బల్బులతో డెకరేషన్ పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, సిపిఓ రాజారామ్, కలెక్టరేట్ ఏవో, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె.

## - బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఆగస్టు 8**

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 17 నుండి సమ్మె చేపడుతామని బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో దండి వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాటర్ సప్లయ్, స్ట్రీట్ లైట్స్, గార్డెన్స్, ఫిల్టర్ బెడ్స్, శానిటేషన్ జవాన్లకు, వర్క్ ఇన్స్పెక్టర్ లకు జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనం 19,500 ఇవ్వాలని గత సంవత్సరం నుండి మున్సిపల్ కమిషనర్, మేయర్, జిల్లా కలెక్టర్, కార్మిక అధికారులకు పలు దఫాలుగా వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. అయినా సరే మున్సిపల్ కార్పొరేషన్ నిమ్మకు నిరెత్తినట్లుగా వ్యవహారిస్తున్నదని ఆరోపించారు. ఔట్ సోర్సింగ్ డ్రైవర్స్ కు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మేడే కానుకగా ప్రకటిచిన వెయ్యి రూపాయలను, డ్రైవర్స్ వేతనాల నుండి కట్ చేస్తే డ్రైవర్స్ మెరుపు సమ్మెకు దిగడంతో వెయ్యి రూపాయలు తిరిగి చెల్లిస్తామని కమిషనర్ చెప్పి దాదాపు సంవత్సరం గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు.

సమస్యల పరిష్కారానికి వెంటనే ఇంజనీరింగ్, శానిటేషన్ నుండి ఇద్దరు అధికారులను నియమించి వెంటవెంటనే సమస్యలు పరిష్కరించడం ద్వారా కార్మికులకు మానసిక ఆందోళన



తగ్గుతుంది, కార్పొరేషన్ కు పని సకాలంలో జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు సబ్బని లత, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ వాటర్ సప్లయ్, గార్డెన్స్, స్ట్రీట్ లైట్స్, డ్రైవర్స్, శానిటేషన్, జవాన్ల నాయకులు నవీన్ , ఎల్లయ్య, రాహుల్, హరీష్, మురళి, శ్రీశైలం, నవీన్, ప్రశాంత్, నందబాయి, విజయ, విద్య, మోహన్ గౌడ్, కె. హరీష్,శంకర్, కె. సహదేవ్, ఫెరోజ్ ఖాన్, రితేష్, నీరడి సాయిలు, కిరణ్, కె.వెంకట స్వామి, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం

**ప్రధానంగా ఏడు అంశాలపై చర్చలు**

**ఏనుగుల బెడద ... 8కుంకీ ఏనుగులకు అంగీకారం**

**ఎర్రచందనం అక్రమ రవాణా అడ్డుకునేందుకు చర్యలు**

**కర్నాటక ప్రభుత్వంలో పలు సమస్యలపై పవన్ చర్చలు**

**సిఎం సిద్ధరామయ్యతో మర్యాదపూర్వక భేటీ**

**బెంగళూరు:** కర్ణాటక – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఎల్లప్పుడూ సుహృద్భావ వాతావరణం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.కీలకమైన అంశాలపై చర్చ జరగడంతో పాటు భవిష్యత్తులో రెండు రాష్ట్రాల అటవీ అధికారులు సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వైపు ఏనుగుల సమస్య అధికంగా ఉందని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తగిన విధంగా సహకారం అందించడం సంతోషం కలిగించిందని తెలిపారు. ముఖ్యంగా 8 కుంకీ ఏనుగులను ఏపీకి అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం ఒప్పుకోవడం మంచి పరిణామమని వివరించారు. రెండు రాష్ట్రాల అధికారులు, పాలకులు కూడా కలిసి పని చేస్తే చాలా సమస్యలు తీరుతాయని తెలిపారు. అటవీ శాఖపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాల సమష్టి సమావేశంలో ఏడు ప్రత్యేకమైన అంశాలు చర్చకు వచ్చాయన్నారు. ఈ విషయంపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు, అధికారులు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిపారు. గురువారం బెంగళూరు విధానసౌధలో కర్ణాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రేతో పవన్ కళ్యాణ్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇరు రాష్ట్రాల అటవీ శాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొని వివిధ అంశాలపై ఎంఓయూలు కుదుర్చుకొని సంతకాలు చేశారు. ఈ సమావేశం అనంతరం పవన్ కళ్యాణ్, ఈశ్వర్ ఖండ్రే సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. చిత్తూరు జిల్లా పరిధిలో, పార్వతీపురం ప్రాంతంలోను ఏనుగులు గ్రామాల మీదకు వచ్చి పంటలు నాశనం చేస్తున్నాయని. ప్రాణ హాని కలిగిస్తున్నాయని చెప్పారు. ఇలా వచ్చే ఏనుగులను తిరిగి అడవిలోకి తరిమేందుకు కుంకీ ఏనుగులు అవసరమని పవన్ కళ్యాణ్ తెలిపారు. కుంకీ ఏనుగులు కర్ణాటక దగ్గర ఉన్నాయని అన్నారు. కొన్ని కుంకీ ఏనుగులు మన రాష్ట్రానికి ఇచ్చేలా కర్ణాటక అటవీ శాఖను కోరామని అన్నారు. అటవీ శాఖా మంత్రిగా అధికారులతో సమీక్ష సందర్భంగా కర్ణాటక సరిహద్దును పంచుకుంటున్న చిత్తూరు జిల్లా గ్రామాలతో పాటు పార్వతీపురం మన్యం ప్రాంతంలో ఏనుగుల సమస్య తీవ్రంగా ఉందని నా దృష్టికి వచ్చింది. ఇవి పంట పొలాలను నాశనం చేయడం వల్ల విపరీతమైన ఆస్తినష్టం జరగడంతో, ప్రాణనష్టం కూడా జరుగుతోంది. దీనికి పరిష్కారంగా ఏనుగుల దారి మళ్లించేందుకు ఎంతగానో ఉపయోగపడే కుంకీ ఏనుగుల ప్రస్తావన వచ్చింది. కుంకీ ఏనుగులు కర్ణాటక అటవీశాఖ వద్ద ఉన్నాయని అధికారులు చెప్పగానే, కర్ణాటక పాలకులతో మాట్లాడాను. వారు వెంటనే స్పందించి నన్ను బెంగళూరు రావాలని ఆహ్వానించడం ఆనందం కలిగించింది. ఆంధ్రప్రదేశ్‌కు సహకారం అందించడానికి సిద్ధమైన కర్ణాటక ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఇక మీదట కూడా రెండు రాష్ట్రాలు ఇదే సహకారంతో సమష్టిగా ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నానని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ సమావేశంలో ఏడు ప్రత్యేక అంశాలపై పూర్తిస్థాయిలో చర్చించాం. ముఖ్యంగా శేషాచలం అడవుల్లో లభ్యమయ్యే ఎర్రచందనం నరికివేత మీద చర్చించాం. ఎంతో విలువైన ఎర్రచందనం ఇతర దేశాలకు అక్రమంగా తరలి వెళ్లడం మీద కర్ణాటక అధికారులు కూడా దృష్టి సారించాలని కోరాం.

ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా కర్ణాటక, తమిళనాడు ఇతర ప్రాంతాల మీదుగా ఎర్రచందనం అక్రమంగా రవాణా అవుతోంది. కర్ణాటక అధికారులు కూడా అక్రమంగా రవాణా అవుతున్న రూ.140 కోట్ల ఎర్రచందనాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. ఇది కర్ణాటక అటవీశాఖ ఆధీనంలో ఉంది. ఇంత భారీ మొత్తంలో ఎర్రచందనం పట్టుకున్న అధికారులకు అభినందనలు. దీన్ని ఏ విధంగా ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లాలనే విషయంపై మరోసారి చర్చించి ముందుకు వెళ్తాం.




## ఎన్నో సినిమా షూటింగ్‌లకు సజీవ సాక్ష్యం గోదావరి ఒడ్డున నేలగొరిగిన 150 ఏళ్ల నాటి చెట్టు

గోదావరి నది వరద ఉధృతికి సినిమా చెట్టు (కుమారదేవం చెట్టు) ఇటీవల నేలకొరిగిన విషయం తెలిసిందే. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి నది తీరాన ఉన్న 150 సంవత్సరాల చరిత్ర కలిగిన గన్నేరు చెట్టు ఇది. టాలీవుడ్‌లో దాదాపు 300కి పైగా సినిమాలు ఈ చెట్టు కింద షూటింగ్ జరుపుకున్నాయని.. దిగ్గజ దర్శకులు వంశీ, కె విశ్వనాథ్, జంధ్యాల, బాపు, రాఘవేంద్ర రావు తమ సినిమాల్లో ఈ చెట్టుని వాడినట్లు స్థానికులు చెబుతుంటారు. చివరిగా ఇక్కడ రామ్ చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ షూటింగ్ ఇక్కడ జరుపుకున్నట్లు సమాచారం. చాలా సినిమాలను ఈ చెట్టు కింద తీయడం వలన దీనిని సినిమా చెట్టు అంటారని.. నిర్మాతలకు, దర్శకులకు వారి సినిమాలో ఈ చెట్టును చూపించి నట్లయితే ఆ సినిమా విజయం సాధిస్తుందని అప్పట్లో నమ్మకం ఉండేదని సమాచారం. అయితే ఈ చెట్టు కూలిపోవడంతో కుమారదేవం ప్రజలతో పాటు సినీ ప్రియులు ఆవేదన చెందుతున్నారు. ఆధునిక పద్ధతులను ఉపయోగించి చెట్టుని ఎలాగైనా బ్రతికించండి అంటూ ఏపీ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.ఇక దర్శకుడు వంశీకి అయితే ఈ చెట్టుతో ప్రత్యేక అనుబంధం ఉంది. చిన్నప్పుడు ఇక్కడే వంశీ అడుకునేవాడని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే తాజాగా ఈ చెట్టు కూలిన విషయాన్ని తెలుసుకున్న దర్శకుడు వంశీ చెట్టుని సందర్శించాడు. గోదావరి వరద ఉధృతికి చెట్టు కూలిపోవడంతో వంశీ బోరుమని ఏడ్చినట్లు సమాచారం.



# హరిహరవీరమల్లులో అనుపమ్ ఖేర్





పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరి హర వీరమల్లు' పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. ఈ పీరియాడికల్ యాక్షన్ చిత్రానికి మరో అదనపు ఆకర్షణ తోడైంది. లెజెండరీ నటులలో ఒకరైన అనుపమ్ ఖేర్ హరి హర వీరమల్లు'లో భాగమయ్యారు. ఈ చిత్రంలో ఆయన అత్యంత విలువైన పాత్ర పోషిస్తున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తొలిసారిగా లెజెండరీ నటుడు అనుపమ్ ఖేర్ తో తెరను పంచుకోబోతున్నారు. ఈ ఇద్దరు అగ్ర నటుల కలయికలో వచ్చే సన్నివేశాలు సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అభిమానులను ఎంతగానో అలరిస్తాయని నిర్మాతలు చెబుతున్నారు. 'హరి హర వీరమల్లు' చిత్రం జీవితాంతం గుర్తుండిపోయే మధురానుభూతిని అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జ్యోతి కృష్ణ 'హరి హర వీరమల్లు' చిత్ర దర్శకత్వ బాధ్యతలను తీసుకొని, సినిమాపై అంచనాలను పెంచే ప్రత్యేక టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న పవన్ కళ్యాణ్ అభిమానులు, ప్రత్యేక టీజర్ విశేషంగా ఆకట్టుకోవడంతో, రెట్టింపు ఉత్సాహంతో మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఛాయాగ్రాహకుడు మనోజ్ పరమహంస ఈ చిత్రం యొక్క మిగిలిన భాగం చిత్రీకరణ పూర్తి చేయడం కోసం సాంకేతికత బృందంలో చేరారు. లెజెండరీ కళా దర్శకుడు తోట తరణి మరియు వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్, బాహుబలి ఫేమ్ శ్రీనివాస్ మోహన్ వంటి దిగ్గజాలు ఈ అద్భుత చిత్రం కోసం పని చేస్తున్నారు. ఏ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే మిగిలిన భాగం చిత్రీకరణను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం చిత్రబృందం లొకేషన్ల వేటలో ఉంది. మరోవైపు నిర్మాణానంతర పనులు ప్రారంభించారు. వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. 'హరి హర వీరమల్లు పార్ట్-1: స్వార్డ్ లబ స్పిరిట్' త్వరలో విడుదల కానుంది. మరిన్ని వివరాలను నిర్మాతలు త్వరలో వెల్లడించనున్నారు.

# మిస్టర్ బచ్చన్.. కొత్త ప్రపంచంలోకి వెళతారు

## దర్శకుడు హరీష్ శంకర్ వెల్లడి




హరీశ్ శంకర్ దర్శకత్వంలో మాస్ హీరో రవితేజ నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్' భారీ అంచనాల మధ్య ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో హరీశ్ శంకర్ వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ సినిమా విశేషాలను పంచుకుంటున్నారు. 'బాలీవుడ్ మూవీ 'రైడ్'కు రీమేక్‌గా 'మిస్టర్ బచ్చన్' తెరకెక్కినప్పటికీ ఒరిజినల్ కథకు దీనికీ పోలిక ఉండదు. 70 శాతం మార్పులు చేశాం. లవ్ స్టోరీ ప్రధానంగా దీన్ని తెరకెక్కించాం. కచ్చితంగా ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ ఓ కొత్త ప్రపంచంలోకి వెళ్తారు. హీరో చాలా ఎనర్జిటిక్‌గా ఉంటాడు. పాటలు కలర్‌ఫుల్‌గా ఉంటాయి. డైలాగులు ఎప్పటికీ గుర్తుపెట్టుకునేలా ఉంటాయని చెప్పారు. ఇక పవన్ కల్యాణ్‌తో తీస్తోన్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' గురించి మాట్లాడుతూ ఆ సినిమా ప్రారంభించిన సమయంలో తనపై వచ్చిన ట్రోలింగ్‌పై స్పందించారు. 'తెరీ' రీమేక్ (ఉస్తాద్ భగత్‌సింగ్) ఆపేయమని నన్ను ట్రోల్ చేస్తూ 2లక్షల 68వేల నెగెటివ్ ట్వీట్స్ వచ్చాయి. రికార్డు ఇది. ఏ దర్శకుడి మీద ఈ స్థాయిలో ట్రోలింగ్ ఎటాక్ జరగలేదు. అయినా నేను సినిమా తీయడం ఆపలేదు. ఆ టీజర్ విడుదలయ్యాక నన్ను ట్రోల్ చేసిన వాళ్లందరూ సారీ చెప్పారు' అని హరీశ్ శంకర్ అన్నారు. ఇక ఇటీవల తాను పవన్ కల్యాణ్‌ను కలిసినట్లు ఆయన వెల్లడించారు. సినిమాలు పూర్తిచేయాలనే సంకల్పంతో ఉన్నారని.. త్వరలోనే దీని మిగిలిన షూటింగ్‌ను ప్రారంభిస్తామన్నారు.

# నాగచైతన్య ,నటీశోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం

## వివరాలు వెల్లడించిన తండ్రి నాగార్జున



టాలీవుడ్ హీరో నాగచైతన్య , నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలను నటుడు నాగార్జున సోషల్‌మీడియాలో పంచుకున్నారు. నా తనయుడు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం ఈరోజు ఉదయం 9.42 గంటలకు జరిగింది. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం సంతోషంగా ఉంది. మా కుటుంబంలోకి ఆమెను సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. నూతన జంటకు నా అభినందనలు. వీరి జీవితం సంతోషం, ప్రేమతో నిండాలని కోరుకుంటున్నా 8.8.8 అనంతమైన ప్రేమకు నాంది అని నాగార్జున పేర్కొన్నారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందించారు. కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. నాగచైతన్యకు గతంలో నటి సమంతతో పెళ్లయ్యాక కొంతకాలానికి వ్యక్తిగత కారణాల వల్ల వారిద్దరూ విడిపోయారు. చై-శోభిత ఎంతోకాలం నుంచి స్నేహితులుగా ఉన్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. శోభిత ధూళిపాళ్ల 2013లో ఫెమినా మిస్ ఇండియా టైటిల్ విన్నర్‌గా నిలిచారు. 2016లో సినీ రంగంలోకి ప్రవేశించారు. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు. నాగచైతన్య 'తండేల్'తో బిజీగా ఉన్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో ఇది రూపొందుతోంది.



# పవన్ అద్భుతాలు సృష్టిస్తారు

నటి శ్రియ ఆసక్తికర కామెంట్స్ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ను ఉద్దేశించి నటి శ్రియ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాదులోని ఓ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆమె.. రానున్న రోజుల్లో పవన్‌కల్యాణ్ అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ అద్భుతమైన విజయం అందుకున్నారు. ఆయన విషయంలో నేనెంతో గర్వంగా ఉన్నా. మేమిద్దరం గతంలో 'బాలు' కోసం కలిసి వర్క్ చేశాం. ఆయన చాలా సైలెంట్‌గా ఉంటారు. శ్రమపడే మనస్తత్వం కలిగిన వ్యక్తి. ఆ సినిమాలోని ఓ పాట చిత్రీకరణ సమయంలో ఆయన కాలికి గాయమైంది. పాట షూట్ పూర్తయ్యేవరకూ ఆ విషయాన్ని ఎవరితోనూ చెప్పలేదు. ప్రజలకు మంచి చేయాలని ఎప్పుడూ తాపత్రయపడేవారు. ప్రజలు ఆయన్ని ఎన్నుకోవడం సంతోషంగా ఉంది. ఆయన అద్భుతాలు సృష్టిస్తారని నేను నమ్ముతున్నా అని శ్రియ తెలిపారు. చిరంజీవితో మరోసారి కలిసి వర్క్ చేయాలనుకుంటున్నానని చెప్పారు. ప్రస్తుతం తాను 'షో టైమ్' అనే కార్యక్రమం కోసం వర్క్ చేస్తున్నానని చెప్పారు. బాలీవుడ్‌లోనూ అవకాశాలు వస్తున్నాయ న్నారు. తెలుగులో తేజ సజ్జా మూవీ కోసం యాక్ట్ చేస్తున్నానన్నారు. సినిమాకు ఇప్పుడు భాషతో సంబంధం లేదని.. కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు వీక్షిస్తున్నారని తెలిపారు. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లో ఏ చిత్ర పరిశ్రమ అంటే ఇష్టమని విలేకరి ప్రశ్నించగా ఇండియన్ సినిమా అని చెప్పడం తనకు ఇష్టమన్నారు.

# ఆ కథ నాకోసమే రాసినట్లుగా ఉంది: తాప్సీ



హసీన్ దిల్‌రుబా'తో 2021లో విజయాన్ని అందుకున్నారు నటి తాప్సీ ఇప్పుడు దీనికి కొనసాగింపుగా తెరకెక్కిన 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈనేపథ్యంలోనే తాప్సీ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. 'హసీన్ దిల్‌రుబా'లో హీరోయిన్ పాత్ర కోసం మొదట వేరే నటిని అనుకున్నారని చెప్పారు. అనుకోని కారణాల వల్ల ఆమె సినిమాలో నటించకపోవడంతో.. తాను ఆ ప్రాజెక్ట్‌లో భాగమయ్యానని చెప్పారు. తానొక విభిన్నమైన కథతో సినిమా చేయాలనుకుంటున్నానని దర్శకురాలు కనికా ధిల్లాన్ ఓసారి నాకు చెప్పారు. ఆ కథ వినేందుకు నేనెంతో ఆసక్తిగా ఉన్నానని ఆమెకు తెలియజేశా. అదే సమయంలో నేను వేరే సినిమా షూటింగ్‌లో బిజీ అయ్యా. ఆ షూట్ పూర్తయ్యేసరికి.. కనికా వేరే నటిని సంప్రదించినట్లు తెలిసింది. వారిద్దరి మధ్య ఒప్పందం కుదిరిందని త్వరలో ఆ సినిమా పట్టాలెక్కనున్నట్లు వార్తలు వచ్చాయి. కొన్ని నెలల తర్వాత కనికా ఫోన్ చేసి.. ఎందుకు? ఏమిటి? అని ప్రశ్నించకుండా స్క్రిప్ట్ నరేషన్ కోసం ఆఫీస్‌కు రమ్మని పిలిచింది.